


# అంటుకట్టిన మొక్క

—గుడిసేవ సుందరరామయ్య

"ఆనంద్!" శక్తినంతా కూడదీసుకొని గట్టిగా అరవాలనుకొన్నారు రంగనాథంగారు.

కాని, గొంతు పెగల్లేదు.

మనస్సులో ఉద్భవించిన అహంకారం, ఆవేశం ఆయన గొంతును నొక్కేశాయి.

ఎంతోకాలంగా భద్రంగా పెంచుకొన్న ఆత్మాభిమానం కొరడాదెబ్బ తిన్న పెద్దపులిలా విజృంభించింది.

ఎప్పుడూ గాంభీర్యం ఉట్టిపడే ఆయన వదనంలో ఒక్కసారే ఉద్రేకం, ఉద్వేగం సముద్ర కెరటాల్లా ఉవ్వెత్తున లేచాయి.

శరీరంలోని రక్తమంతా కళ్ళలో గూడు కట్టుకోవటానికి ప్రయత్నించింది.

అసహ్యం, అవమానం శరత్కాల మేఘాల్లా ఆయన మనస్సును కప్పేశాయి.

మెరుపులధాటికి తట్టుకోలేని గగనతలమైంది ఆయన వదనం.

దాదాపు అరవై సంవత్సరాల ప్రాయం ఉన్న వయస్సుకు సహితం లొంగని ఆయన శరీరం ఆ క్షణంలో సుడిగాలిలో కదలాడే ఎండుటాకులా వణికిపోయింది.

అభిమానానికి, అపమానానికి జరుగుతున్న సంఘర్షణలో ఆయన మనస్సు చివుక్కుమంది.

"ఆనంద్ !!" అని ఈసారి ఆయన గొంతునుండి మెల్లగా వినపడింది.

అయితే, ఆ పిలుపులో ధ్వనించింది ద్వేషం కాదు.

మమకారంతో నిండిన జాలి!

ఉప్పెనలా వచ్చిన ఉద్రేకం అంతలోనే మాయమైంది.

రక్తపాశం వాస్తవికతకు చుట్టుకుపోయి మనోసాగరాన్ని మథించింది.

ఆ మథనంలో తొలుత క్రోధం అవతరించినా క్రమేపీ ప్రేమ, అనురాగం, ఆప్యాయత, అనుబంధాలు వెలికివచ్చాయి.

తత్ఫలితంగా రంగనాథంగారి ముఖంలో నిర్లిప్తత, నిస్సత్తువ ఏర్పడ్డాయి.

కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి.

చేతిలోని ఉత్తరాన్ని మెల్లగా మడిచి కవర్లో పెట్టేసి అలానే కుర్చీలో కూర్చుండిపోయారు.

నిశ్చలంగా ఉన్న నీటిలో పడ్డ రాయిలా ఆ ఉత్తరం ఆయన మనస్సులో ఆలోచనాతరంగాలను ఉద్భవింపజేసింది.

ఆనంద్ ఇంతపని చేస్తాడని తను కలలో కూడా అనుకోలేదు. అయినా, ఇందులో ఆనంద్ ప్రమేయం ఎక్కువ ఉండి ఉండదు. దీనికంతటికీ కారణం అతని మామగారే. ఆనంద్ స్వభావం తనకు ముందునుంచీ తెలుసు. ఒక స్థిరమైన ఆలోచన, వ్యక్తిత్వం లేవు వాడికి. తనకై తాను స్వతహాగా ఏ విషయంలోనూ నిర్ణయం తీసుకోలేని అసమర్థుడు వాడు. ఎదుటివాడు ఎంత చెబితే అంత! ఈ నాడు తన కీ కవరు రావటానికి కూడా వాడి బలహీన మనస్తత్వమే కారణం.

రామలింగయ్య స్వార్థపరుడని, పేచీకోరు మనిషని ఎంతోమంది చెప్పగా విన్నాడు తను. కాని, పదిమందిలో పెద్దమనిషిగా చలామణి అవుతున్న వ్యక్తి కావడంచేతనూ, పెద్దపెద్దవారితో పరిచయం గల వ్యక్తి కావటంచేతను అతనికి అల్లుణ్ణి చేస్తే ఆనంద్‌కు మంచి భవిష్యత్తు ఉంటుందని ఆశించాడు తను! అతనికి కూడా ఒక్కతే కూతురు. గ్రాడ్యుయేటు. అందానికి తోడు చదువు, సంస్కారాలున్న ఆ పిల్ల ఆనంద్‌కు సరైన జోడీ అని తను ఎంతో సంతోషించాడు. పెళ్ళినాటికి ఆనంద్ ఇంజనీరింగ్ పాసయి ఉన్నాడు. ఉద్యోగం లేదు. రామలింగయ్య పలుకుబడి ఉపయోగించి సంవత్సరం లోపుగానే

# ఎవరా నిన్ను మేల్కొల్పింది!

మాదిరాజు రంగారావు

ఎవరా నిన్ను మేల్కొల్పింది? ఆ అర్ధరాత్రి!
మరిచిపో! మా వాండ్లేను, పెద్దలు!
లేచి కూర్చున్నావు—సరే
కుదురు నిద్రపోవా? తల్లీ!
అర్ధరాత్రి మేల్కొల్పిన నేరానికి
ఇంకా తూగుతూనే ఉన్నావా?
సరేలే —
ఇప్పుడు మేమూ తూగుతున్నాం
నడిచితో వేడితో సీసాతో!
ఆ గాంధీ కన్న కలలే ఇంకా
నెమరువేస్తూ కూర్చున్నావా?
ఇప్పుడు మేమూ ముక్కలౌతున్నాం
మాటిమాటికి వాళ్ళు కలుసుకుంటూ.
నీకు జ్ఞాపకం ఉండే ఉంటుంది,
అమ్మయ్యో! అప్పుడే పాతికేళ్ళు గడిచాయి,
అయినా ఆ పాత ఇంట్లోనే నివాసం,
దూలాలు పుచ్చిపోతే
పోటీలు పెడుతూ,
గోడలు కూలిపోతే
కప్పించింది అద్దం పెడుతూ,
సందికొక్కులు చేరి
కలుగులు త్రవ్వితే
బోనులు నిలుపుతూ
ఇంటిమట్టి కూరుస్తూ,
అప్పుడప్పుడూ గత్యంతరంలేక
వాటితోనూ స్నేహం చేస్తూ
అలాగే గడుపుతున్నాం రోజులు
ఏడాది కొక మారు వెల్లవేస్తూ
అలవాటు పడిన ఈ రోజులు
వదలడం అంటే ఎంత కష్టం!
ఏ మార్పూ లేకుండా—దీటుగా
ప్రొద్దు పొడుస్తుంది మా ముఖాల్లో
ప్రొద్దు గ్రుంకుతుంది మా ముఖాల్లో.
చీకట్లకు భయం వేసి
ముఖాలు దాచుకుంటాయి మూలల్లో.
నీకు స్వాతంత్ర్యం లేదూ?
నీకు స్వేచ్ఛ అంటే తెలీదూ?
అయితే, కంటినిండా నిదుర పోరాదూ
ఇలా తూగుతూ కూర్చోకపోతే,
కలలో కలవరింతలు మానేసి
నీకు పుణ్యముంటుంది, తల్లీ!
చివరి మాట కాస్త విని పడుకో
ఇల్లు కూలే లోపల లేస్తావు కదూ!
అప్పుడు నిన్ను లేపేవా లెవరూ ఉండరు,
ఎవరి భయంలో వా రుంటారు
ఎవరి స్వార్థంలో వా రుంటారు!
నీకు స్వాతంత్ర్యం ఉంది
నీకూ స్వేచ్ఛ ఉంది
అందుకే నిద్రపో గాఢంగా
మేల్కొని మాత్రం కలలు గనకు!
నీ కలల్లో మనుష్యుల్ని తూగించకు
నీ సేవలో మనుష్యుల్ని వేగించకు.
నిద్రపో గాఢంగా కంటినిండా
నీ నిదురే మాకు అదృష్టం!
ఎవరైతేనేం నిన్ను మేల్కొల్పింది
మా వాండ్లేను, మరచిపో, నిద్రపో! ☆

ఉద్యోగం చేయిస్తానని తనకు మాటిచ్చి వాణ్ణి అల్లుణ్ణి చేసుకొన్నాడు.

ఈ సంబంధం తన పెద్ద కొడుక్కి, కోడలికి ఏమాత్రం ఇష్టం లేదు. 'చూస్తూ చూస్తూ ఉద్యోగం కొరకు వాణ్ణి అమ్ముకోవటం బాగాలేదు, నాన్నా! పైగా అల్లుడు తన ఇంటిదగ్గరే ఉండాలంటున్నారు రామలింగయ్యగారు. ఒకరకంగా ఇది ఇల్లరికమే. ఇంతకాలం వాణ్ణి పెంచి ఇప్పుడిలా వాణ్ణి దూరం చేసుకోవటం నా కిష్టంలేదు, నాన్నా!' అన్నాడు భూషణం. భూషణానికి తమ్ముడంటే అమితమైన ప్రేమ. ఆనంద్‌కి జన్మనిచ్చి కన్నుమూసింది పార్వతి. అప్పట్నుంచీ భూషణమే కంటికి రెప్పలా కాపాడుతూ వాణ్ణి పెంచి పెద్దచేశాడు. వయస్సులో కూడా వాళ్ళ ఇద్దరికి చాలా వ్యత్యాసం ఉండటంచేత తన చిన్న తమ్ముణ్ణి ఎంతో అపురూపంగా పెంచుకొన్నాడు భూషణం. తను కూడా ఆనంద్ బాగోగులు చూస్తున్నప్పటికీ వ్యాపారరీత్యా ఎక్కువగా ఊళ్ళు ప్రయాణాలు చేయాల్సి వచ్చేది. ఎప్పుడూ ఇంటిదగ్గరే ఉండటం సాధ్యపడేది కాదు. తయారుచేసిన రోల్డుగోల్డు నగలను తీసుకొని వివిధ ప్రాంతాలకు వెళ్ళాల్సి వచ్చేది. ఆ సమయాల్లో భూషణమే వాడికి అన్న, తల్లి, తండ్రి — అన్నీ! తమ్ముడి భవిష్యత్తు కోసం భూషణం చదువును పి. యు. సి. తో ఆపేసి తనతోపాటు వ్యాపారంలో దిగాడు. తన తండ్రికి ఇచ్చిన కొద్దిపాటి ఆస్తి సహాయంతో రోల్డుగోల్డు వ్యాపారం ప్రారంభించిన తను క్రమేపీ డబ్బు సంపాదించ గలిగాడు. వయోభారంచేత ఊళ్ళు తిరగలేక వ్యాపారం కుంటుపడే పరిస్థితి వచ్చేసరికి భూషణం ఆదుకొన్నాడు.

'పెద్ద పెద్ద చదువులు చదివి పెద్దగా ఉద్యోగం చేసుకోరా — నీ కీ వ్యాపారం ఎందుకు?' అని తను ఎంత మందలించినా భూషణం వినిపించుకోలేదు. 'ఆ చదువులన్నీ మన ఆనంద్‌కే చెప్పించి పెద్ద ఆఫీసర్ని చేద్దాం. ఈ వయస్సులో మీరిక వ్యాపారం చేయలేరు. అదీగాక ఈ వ్యాపారమంటే నాకు ముందునుంచీ ఆసక్తి ఉంది' అని తనకు నచ్చచెప్పి వ్యాపార రంగంలో దిగాడు భూషణం.

అనుకొన్నట్లుగానే ఆనంద్‌ను ఇంజనీరింగ్ చదివించాడు భూషణం. వాడు మాత్రం మేనమామ కూతురు సుజాతను పెళ్ళి చేసుకొన్నాడు. సుజాత కూడా ఆనంద్‌ని స్వంత తమ్ముణ్ణిలా చూసుకొనేది. బయటకు వెళ్ళినప్పుడల్లా 'వెళ్ళొస్తా, వదినా!' అని చెప్పనిదే వెళ్ళేవాడు కాదు ఆనంద్. వదిన అంటే వాడికి పూజ్యభావం ఉండేది. ఆమె ఎప్పుడైనా పుట్టింటికి వెళితే — 'వదిన వచ్చేసరికి వంటింట్లో, చేతి కూడు అనాత్రించేనా' అంటూ ఎంతో బాధపడేవాడు. సుజాతది అమృత హృదయం. ఆమె కోడలు కావటం తనెంతో అదృష్టంగా భావించాడు. 'రెండో కోడలు కూడా నీలాంటి అమ్మాయే దొరికితే మా ఆనంద్ సుఖపడతాడమ్మా' అని తనంటే, ఆమె సమాధానంగా—'ఆ కోడలు సెలక్షన్ విషయం నాకు వదిలేయండి, మామయ్యా! నేను ఇదివరకే ఓ అమ్మాయిని సెలక్ట్ చేసి ఉంచానులే!' అనేది. ఆమె సెలెక్ట్ చేసిన అమ్మాయి తనకు తెలుసు! ఆమె పిన్ని కూతురు, లక్ష్మి. మనిషి బాగానే ఉంటుంది కాని, ఎక్కువగా చదువుకోలేదు. ఆనంద్ ఆ అమ్మాయిని చేసుకోవటానికి సుముఖంగా లేడని తనకు తెలిసినా, ఆ విషయాన్ని సుజాత వద్ద బయట పెట్టలేదు. ఆనంద్ ఇంజనీరింగ్ కోర్సు పూర్తయిన ఆరు నెలలకు కాబోలు భోగినాథం రామలింగయ్య సంబంధం తీసుకు వచ్చాడు. ఆనంద్‌కు ఆ పిల్ల నచ్చటంతో పెళ్ళి వైభవంగా జరిగిపోయింది.

ఆ తరవాత ఆరు నెలలకే ఆనంద్‌కు అసిస్టెంట్ ఇంజనీర్‌గా పోస్టింగ్ వచ్చింది. ఆ ఉద్యోగం రావటానికి కారణం వాడి మామగారి పలుకుబడే. వాడి పెళ్ళి విషయంలో తను తీసుకొన్న నిర్ణయం సరైనదే అనిపించింది.

అన్నైతే వాడి కంత త్వరగా ఉద్యోగం ఇప్పించగలిగేవాడా? ఆ సంగతే భూషణం దగ్గ రంటే వాడు ఒప్పుకోలేదు.

'ఉద్యోగా లిప్పించే పలుకుబడి ఆయన ఒక్కడికే ఉందా? మనం మాత్రం ఇప్పించుకోలేమా? అంతగా ఉద్యోగం దొరక్కపోతే కొంత మాగాణి భూమిని, తూర్పు వీధిలో ఉన్న మేడను అమ్మేసి వచ్చిన డబ్బుతో ఓ వర్క్‌షాపు పెట్టించేవాళ్ళం. వాడికే కాక మరో పది మందికి కూడా ఉపాధి దొరికేది' అన్నాడు. భూషణానికి ముందునుంచీ రామలింగయ్యంటే సదభిప్రాయం లేదు. అతను చాలా పేచీకోరు వ్యక్తని, కోర్టు మనిషని భూషణం అనుమానం.

ఈనాడు వాడి అనుమానమే నిజమైంది. తను పుట్టిన దాదిగా ఇంతవరకు ఏనాడు కోర్టుకు వెళ్ళి ఎరుగడు. తను ఎవరి దగ్గర అప్పులు చేయలేదని కాదు. అవసరమైనప్పుడల్లా అప్పులు చేశాడు తను. కాని, ఎప్పుడూ కోర్టు నోటీసులను పొందలేదు.

అలాంటిది ఈ నాడు ...

తన రక్తంతో రక్తం పంచుకొని పుట్టిన ఆనంద్ ...

హే భగవాన్!

ఏమి టీ పరీక్ష?

'టేబుల్ మీద మోచేతులు ఆన్చి,

అరచేతుల్లో తల దాచుకొని ఎంతోసేపు విచారించారు రంగనాథంగారు.

"మామయ్యా! టీ తెచ్చాను!" అన్న సుజాత మాటలు విని తల ఎత్తారు.

ఆయన ముఖంలో చోటుచేసుకొన్న వైరాగ్యాన్ని, ఆవేదనను గుర్తించింది సుజాత. పోస్టుమన్ ఇంటికి వచ్చి వెళ్ళిన విషయం ఆమెకు తెలుసు. సాధారణంగా వ్యాపారానికి సంబంధించిన పోస్ట్ ఆయన పేరిట వస్తూనే ఉంటుంది రోజూ. కాని, ఆ రోజు వచ్చిన రిజిస్టర్డ్ లెటర్ ఆయన మనస్సును తీవ్రంగా గాయపెట్టిందన్న సంగతి ఆమెకు తెలియదు.

టీ కప్పును మెల్లగా అందుకొన్నారు రంగనాథంగారు.

"మామయ్యా! ఏమి టలా ఉన్నారు?" అని అడిగింది సుజాత.

"అబ్బే! ఏమీలేదమ్మా! ...ఆఁ ... పద్మ ఇంకా బడినుంచి రాలేదా?" అని ప్రశ్నించారు.

"ఇంకా రాలేదు, మామయ్యా! వచ్చే వేళయింది" అంది.

టీ త్రాగేసి ఖాళీ కప్పును కోడలికి అందించారు రంగనాథంగారు.

ఆయన తన దగ్గర ఏదో విషయాన్ని దాస్తున్నారన్న సంగతిని సుజాత గ్రహించింది. కాని, రెండోసారి మళ్ళీ అడిగి ఆ విషయాన్ని తెలుసుకోవటానికి సాహసం చేయలేకపోయింది.


కప్పుతీసుకొని ఇంట్లోకి వెళ్ళిపోయింది.

అసలు విషయాన్ని కోడలికు తెలియజేయాలని ఉన్నా, రంగనాథంగారికి ఆ విషయం చెప్పటానికి నోట మాట రాలేదు.

అప్పను, ఏమని చెప్పగలరు?

'ఆనంద్ తన వాటా ఆస్తికోసం లాయర్ నోటీసు ఇప్పించాడమ్మా' అని ఆయన చెప్పగలరా?

* * *



చుక్క

చిత్రం— బి. ఎల్. రామాంజనేయులు (గుంతకల్)

తోటలో పడక కుర్చీలో కూర్చుని గులాబీ చెట్టు వైపు పరధ్యానంగా చూస్తున్న రంగనాథంగారు— "తాతయ్యా!" అన్న పిలుపు విని ఉలిక్కిపడ్డారు.

పద్మ పరుగెత్తుతూ వస్తూంది. ఆమె వెనకే ఎదురింటి ప్లీడర్‌గారబ్బాయి మెల్లగా నడిచి వస్తున్నాడు.

రంగనాథంగారి దగ్గరగా వచ్చి, "చూడు తాతయ్యా! వాళ్ళ రమేషు గులాబి మొక్క కావాలంటున్నాడు" అంది పద్మ ఆయాసపడుతూ.

మనవరాల్ని ఒడిలోకి తీసుకొంటూ, "అంత పరుగెత్తుకొని ఎందుకు వచ్చావమ్మా? చూశావా, ఎలా ఆయాస పడుతున్నావో?" అన్నారు.

"ఆ రమేషు నాకంటె ముందు వచ్చి ఆ గులాబి మొక్కను ఎత్తుకుపోతాడేమోనని పరుగు పరుగున వచ్చేశాను, తాతయ్యా!" అంది పద్మ.

"పిచ్చిపిల్ల!" అంటూ మనవరాలిని ముద్దు పెట్టుకొన్నారు రంగనాథంగారు.

అంతలో రమేష్ వచ్చాడు.

"తాతయ్యగారూ! మా అమ్మగారు గులాబి మొక్కను తీసుకు రమ్మన్నారండీ!"

"మీ కిచ్చే మొక్కలు లేవు. వెళ్ళు" అంది పద్మ, కోపంగా రమేష్ వైపు చూస్తూ.

"అదేం కుదరదు! ఆ మొక్క తీసుకొందే వెళ్ళను!" అంటూ అంటు కట్టిన కొమ్మను చూపించాడు రమేష్.

పద్మకంటె ఎక్కువ పట్టుదలగా ఉన్నాడు రమేష్. ఇద్దరి వయస్సులు ఇంచుమించు ఒకటే.


"ఈ తోట మాది! ఇందులోని మొక్కలన్నీ మావే!" అంది పద్మ మరింత బిగ్గరగా.

రమేష్ ఏదో అనబోయాడు.

కాని, అంతలోనే రంగనాథంగారు కల్పించుకొని, "తప్పమ్మా! అలా అనకూడదు! వాళ్ళకా మొక్కను ఇస్తానని నేను మాటిచ్చానమ్మా!" అన్నారు పద్మతో.

"నాకు చెప్పకుండా ఎందు కిస్తానన్నావ్?" తక్కున ప్రశ్నించింది.

"మనకు బోలెడు మొక్కలున్నాయి కదా? ఒకటిస్తే ఏం పోతుంది చెప్పు? వాళ్ళింట్లో గులాబి మొక్కలు లేవట. అందుకనే ఓ మొక్కను అంటుకట్టుక్క



కొమ్మలు          ఫోటో— ఎస్. జి. శేషగిరి ( కోయంబత్తూరు - 2 )

వెళ్ళారు" అన్నారు రంగనాథంగారు, ఆశ్చర్యంగా పద్మ తల నిమురుతూ.

"అంటుకట్టడమేమిటి తాతయ్యా?" అని పద్మ అమాయకంగా ప్రశ్నించేసరికి రంగనాథంగారు మెల్లిగా లేచి ఆమెను గులాబి చెట్టు దగ్గరకు తీసుకెళ్ళారు.

అంటుకట్టిన మొక్కను పద్మకు చూపిస్తూ, "అదేనమ్మా అంటుకట్టడమంటే! ఆ కొమ్మ ఉంది చూశావా? దానికి భూమి తగిలేటట్లు వంచి బరువుకోసం అలా రాయి పెట్టాలి. కొన్ని రోజులయ్యాక ఆ కొమ్మకు కొత్త వేళ్ళు వస్తాయమ్మా!" అని విశదీకరించారు.

అంతలో రమేష్ — "మా అన్నయ్యే కదండీ అంటుగట్టాడు?" అని రంగనాథం గారి వైపు తిరిగి అడిగాడు.

"అవును, బాబూ! ఈపాటికి వేళ్ళు కూడా వచ్చేసి ఉంటాయి. తీసుకెళుదువుగాని!"

ఆ మాటలు విని రమేష్ పద్మవైపు విజయగర్వంతో చూశాడు.

"వీల్లేదు, తాతయ్యా! ఆ మొక్కకు రోజూ నేను నీళ్ళు పోస్తున్నాను. లేకపోతే ఎప్పుడో చచ్చేది. నేను పెంచుకొన్న మొక్కను రమేష్‌కు ఇవ్వటానికి వీల్లేదు." పద్మ అభ్యంతరం చెప్పింది.

"తప్పు, తల్లీ! నువ్వు సత్య హరిశ్చంద్రుడి పాఠం నేర్చుకొన్నావుగా?" అని ప్రశ్నించారు రంగనాథంగారు.

"ఆఁ" అంది పద్మ.

"ఆ పాఠంలో నేర్చుకొన్న నీతి ఏమిటి? ఆడిన మాట తప్పకూడదు! అవునా?" అంటూ కుర్చీ దగ్గరకు వెళ్ళి కూర్చుని మళ్ళీ పద్మను ఒళ్ళో కూర్చోబెట్టుకొన్నారు.

"అవును ... అయితే ఏమిటి?"

"మనంకూడా ఆడిన మాట తప్పకూడదమ్మా! వాళ్ళ కా మొక్కను ఇస్తానని మాటిచ్చాను కదా! ఇప్పుడు మన మాటను నిలబెట్టుకోవాలంటే ఆ మొక్కను రమేష్ వాళ్ళకు ఇవ్వాలి!" అని రమేష్ వైపు తిరిగి, "వెళ్ళి చాకు తీసుకురావోయ్!" అన్నారు.

రమేష్ ఉత్సాహంగా బయటకు పరుగెత్తాడు.

"తాతయ్యా! అయితే, రమేష్‌కు ఆ మొక్కను ఇచ్చేస్తావా?" నిరుత్సాహంగా అడిగింది.

"అవునమ్మా!"

"హుఁ... హుఁ... నువ్వు మంచివాడివి కాదు! ఆ మొక్కకోసం నేనెంత కష్టపడ్డానో తెలుసా? రోజూ రెండు పూటలా పంపుదగ్గర్నుంచి నీళ్ళు తెచ్చి పోశాను. వాళ్ళకు ఇవ్వాలనుకొన్నప్పుడు అప్పుడే ఆ కొమ్మను ఇవ్వకపోయావా? ఇంతకాలం ఎందుకు ఉంచావ్?" ఉక్రోషంగా అడిగింది.

"కొమ్మ మొక్కగా మారాలంటే దాన్ని అంటుకట్టాలమ్మా! వేళ్ళు వచ్చేవరకు తల్లి మొక్కమీదే ఆధారపడుతుంది. ఆ తరవాత అది స్వతంత్రంగా బ్రతక గలుగుతుంది!"

"ఇప్పుడేం చేస్తావు దాన్ని!" ఆత్రంగా ప్రశ్నించింది.

దూరంగా వస్తున్న రమేష్ చేతిలోని చాకును చూపించి, "ఆ చాకుతో కొమ్మను తల్లి మొక్కనుండి వేరు చేస్తాను!" అన్నారు రంగనాథంగారు.

"అయ్యబాబోయ్! తాతయ్యా! మా మాస్టారు నిన్ననే చెప్పారు, చెట్టుకి కూడా ప్రాణం ఉంటుందని! అది కూడా మనలానే గాలిని పీల్చుకొంటుందట! అలాంటప్పుడు చాకుతో కోస్తే దానికి నొప్పిగా ఉండదూ?" పద్మ ప్రశ్నించింది.

రంగనాథంగారు వేదాంతిలా నవ్వారు. "పిచ్చితల్లీ! మనిషికైనా, మానుకైనా ఆ కడుపుకోత తప్పదమ్మా!" పద్మ చూడకుండా కళ్ళు తుడుచుకొన్నారు.

★